క్లుప్తంగా

ఘనంగా అశ్వర్థ నారాయణ స్వామి కల్యాణం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని నగరేశ్వరస్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉదయం శ్రీ అశ్వర్థ నారాయణస్వామి కల్యాణోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 7:30 గంటలకు ఆదివాస విగ్రహాలకు ఉద్వాసన మహాస్నపనం, 8:30 గంటలకు నవగ్రహ, ప్రతిష్ఠ దేవతల హోమాలు, అష్టదిక్పాలికా బలి, కూష్మాండబలి, విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి సమర్పణ వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వి.టి.ప్రకాష్, సెక్రటరీ కె.వేణుగోపాల్, ట్రెజరర్ వై.సుబ్రహ్మణ్యం, టి.జి.రాంప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

కౌతాళం: గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి సంబంధించి మండలానికి పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని పంచాయితీరాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని చూడి పంచాయతీలో సిమెంటు రోడ్లు, డ్రైనేజి నిర్మాణాలకు రూ.9 లక్షలు, తిప్పలదొడ్డికి రూ.8 లక్షలు, మరళి గ్రామానికి రూ.10 లక్షలు, గుడికంబాలి, లింగాలదిన్నె, అగసలదిన్నె పంచాయతీలకు రూ.10లక్షల చొప్పున, ఉప్పరహాల్‌కు రూ.13లక్షలు, రౌడూరు పంచాయితీకి రూ.12 లక్షల ప్రకారం నిధులు మంజూరయ్యాయని వివరించారు. 8 పంచాయతీలకు గానూ మొత్తం రూ.82 లక్షలు విడుదలయ్యాయని , వీటితో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

సీఎండీఎఫ్ నిధులతో గ్రామ చావిడి



పాదలకుంటలో నిర్మిస్తున్న గ్రామచావిడి

కౌతాళం: మండలంలోని పాదలకుంటలో గ్రామ చావిడి నిర్మాణం పనులు దాదాపు పూర్తయ్యాయని పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. ముఖ్యమంత్రి అభివృద్ధి (సీఎండీఎఫ్) నిధులు రూ.10లక్షలతో నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. చావిడి టాప్ వేశామని, దాదాపు 80శాతం పనులు పూర్తయ్యాయని ఫినిషింగ్ పనులు త్వరలోనే పూర్తి చేస్తామని పేర్కొన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి నిధులు మంజూరు చేయించారని, త్వరలో ఎమ్మెల్యేతో ప్రారంభింప చేయిస్తామని వివరించారు. వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు మల్లయ్య, ఎంపీటీసీ మూకన్న, తిమ్మప్ప, లక్ష్మయ్య ఉన్నారు.

కళ్లద్దాల పంపిణీ

కౌతాళం: మండలంలోని పాదలకుంట గ్రామంలో కంటి ఆపరేషన్ చేయించుకున్న 40 మందికి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తన సొంత ఖర్చుతో కళ్ల అద్దాలను అందజేశారని వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు మల్లయ్య, సోమనాథ్ తిమ్మప్ప, మూకయ్య తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఇటీవల గ్రామానికి చెందిన వారికి కర్నూల్‌లోని అమీలియా ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించారు. వారిలో 40 మందికి కళ్ల అద్దాల అవసరం కాగా వాటిని ఎమ్మెల్యే అందజేశారని చెప్పారు.

అ'పూర్వ' సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని వైఎంకే పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ప్రస్తుత హెచ్‌ఎం రత్నం మాట్లాడుతూ 2000 సంవత్సరం బ్యాచ్ విద్యార్థులు పాఠశాలలో కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. 23 ఏళ్ల తరువాత అందరూ కలుసుకోవడంతో నాటి స్మృతులను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. అనంతరం నాడు తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు నరసప్ప, వెంకటేశులు,ఆంజనేయులు,గాయిత్రి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

ఆదోనిరూరల్ : మణిపూర్ అత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించి, మహిళలకు రక్షణ కల్పించాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కల్లుపోతుల సురేష్, జిల్లా అధ్యక్షుడు సాయిరాం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. రెండు నెలలుగా అక్కడ హింస ప్రజ్వరిల్లుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. సంఘం పట్టణాధ్యక్షుడు బొబ్బిలి, సీనియర్ నాయకులు మాస్టర్ కేశవ్, సి.ఆర్.స్వామి పాల్గొన్నారు.

నాడు.. బోర్ల కింద పంటలు సాగు చేసేందుకు రైతులు భయపడేవారు. కారణం.. ఏ అర్ధరాత్రి పూటో కరెంట్ సరఫరా అయ్యేది. అది కూడా మూడు,నాలుగు గంటలకు మించదు. దీంతో రాత్రి పూట బోర్ల వద్ద జాగారం చేస్తూ.. పైర్లకు నీటి తడులు అందించేవారు. ఈ క్రమంలో విద్యుత్ షాక్, విషపురుగుల బారిన పడి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయిన ఉదంతాలు కోకొల్లలు. ఉచితంగా ఏడు గంటల పాటు విద్యుత్ ఇస్తామని ప్రకటించినా ఏనాడు ఆ మేరకు సరఫరా చేసిన దాఖలాలు లేవు. పగలంతా పొలంలో కష్టపడి పని చేసి ఇంటికెళ్లి కాసేపు నడుం వాల్చడానికి కూడా అన్నదాతలకు సమయం ఉండేకాదు. నిర్దేశిత వేళలు ప్రకటించి విద్యుత్ అందజేడయంలో నాటి పాలకులు విఫలమవడంతో రైతన్నలు అవస్థలు పడాల్సి వచ్చింది.

నేడు.. ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట మేరకు.. అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే వ్యవసాయానికి పగటి పూట తొమ్మిది గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేస్తున్నారు. దీంతో ఉదయం వ్యవసాయ పనులతో పాటు పైర్లకు నీటి తడులు అందించి చీకటి పడేలోపు రైతులు ఇళ్లకు చేరుకుంటున్నారు. ప్రతి వారం విద్యుత్ వేళలు ప్రకటించి ఆ మేరకు కోతలు లేకుండా సరఫరా చేస్తుండటంతో అన్నదాతలకు రాత్రి పూట జాగారం చేయాల్సిన అగత్యం తప్పింది. అలాగే విద్యుత్ షాక్, విషపురుగుల బారిన పడి మరణించే వారి సంఖ్య సైతం తగ్గింది. నాలుగేళ్లుగా బోరు, బావుల కింద సమృద్ధిగా పంటలు పండించుకుంటున్నారు.

తీరిన కరెంట్ కష్టాలు

- 9 గంటల పాటు నిరతంతర,నాణ్యమైన విద్యుత్ సరఫరా
- పగటి పూటే ఇస్తుండటంతో రైతులకు తప్పిన అవస్థలు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



వ్యవసాయ బోరు నీటితో మడులు సిద్ధం చేస్తున్న రైతన్న



బోరు కింద సాగు చేసుకున్న పంట పొలాలు

కోసిగి: అది ఎన్నికల వేళ.. వ్యవసాయానికి పగటి పూట నిరంతరాయంగా తొమ్మిది గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను అందజేస్తామని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతన్నలకు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేయడం ప్రారంభించారు. నాలుగేళ్లుగా నాణ్యమైన విద్యుత్ పగటి పూట ఇస్తుండటంతో అన్నదాతలు సంతోషంగా పంటలు సాగు చేస్తున్నారు. జిల్లాలో కర్ణాటక సరిహద్దు ప్రాంతామైన మంత్రాలయం నియోజకవర్గంలో వేసవిలో భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయి. ఈ సమయంలో బోర్లలో నీరు ఊరేందుకు ఎక్కువ సమయం పడుతుంది. రాత్రి పూట నీటి ఊటకు అనువైన సమయం. ఆ సమయంలో మోటార్లు ఆడకపోతే నీరు బాగా ఊరుతుంది. గతంలో రాత్రి పూట విద్యుత్ ఇస్తుండటం, పగటి పూట ఊట అంతంత మాత్రంగా ఉండటంతో పంటలకు నీరు సరిపోయేది కాదు. అయితే ప్రజా ప్రభుత్వంలో నాలుగేళ్లుగా విద్యుత్ కష్టాలు తప్పాయి.

గతంలో అష్ట కష్టాలు..

గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ విద్యుత్ కోసం రైతన్నలు అష్టకష్టాలు పడ్డాల్సి వచ్చేది. పగటి సమయంలో 3 గంటలు, రాత్రి సమయంలో 3 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేసేవారు. ఆ సమయంలో విద్యుత్ కోతలు, లోఓల్టేజీ ఉండేది. దీంతో రోజుంతా బోర్ల వద్ద పడిగాపులు తప్పేవి కాదు. దీంతో పంటలు సక్రమంగా పండేవికాదు.

ఇచ్చిన మాటకు కట్టుబడి..

రైతన్నలు కష్టాలు పడకూడదనే పగటి సమయంలో తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ సరఫరా అందిస్తామని జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి 2019లో అధికారం చేపట్టాక వ్యవసాయాన్ని పండుగల మార్చేశారు. ఉదయం 8 నుంచి సాయంకాలం 5గంటల వరకు వరకు విద్యుత్ సరఫరా అమలు చేశారు. నియోజకవర్గంలో దాదాపు 24,140 ఎకరాల్లో బోర్ల కింద పంటలు సాగవుతున్నాయి.

బోరుబావుల కింద సాగయ్యే పంటలకు నీటి తడులిచ్చేందుకు ఇచ్చే విద్యుత్‌లో గతంలో నిర్ణీత వేళలు, చిత్తశుద్ధి లోపించడంతో కర్షకులు కష్టాలు పడాల్సి వచ్చింది. ఏ అర్ధరాత్రో, అపరాత్రో ఇచ్చేవారు. అందులో నాణ్యమైన విద్యుత్ మూడు నుంచి నాలుగు గంటలు మించి ఉండకపోవడంతో జాగారం చేయడం నిత్యకృత్యమైంది. ఈ క్రమంలో విద్యుత్ షాక్ గురై, విష పురుగుల బారిన పడి ఎందరో ప్రాణాలొదిలారు. పాలకుల పట్టించుకోనితనంతో రైతన్నలకు చివరకు కంటి నిండా నిద్రలేకపోయింది. ప్రస్తుతం నాలుగేళ్లుగా పగటి పూట తొమ్మిది గంటల పాటు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ అందజేస్తుండటంతో సంతోషంగా పంటలు సాగు చేసి చీకటి పడేలోపు ఇళ్లకు చేరుకుంటున్నారు.



ఈ చిత్రంలో పగటి పూట ఉల్లి పంటకు నీటి తడులిస్తున్న ఈయన పేరు సీపీ ఈరన్న. మండల కేంద్రం కోసిగి చెందిన రైతు. దాదాపు పది ఎకరాల పొలం ఉంది. తన పొలంలో రెండు బోర్లు వేయించి పంటలు సాగు చేస్తున్నాడు. నాలుగేళ్లుగా ఏడాదికి రెండు పంటలు సాగు చేస్తున్నాడు. వేరుశనగ, పత్తి, ఉల్లి, కూరగాయల పంటలు సాగు చేస్తాడు. గతంలో నీటి తడుల కోసం రాత్రి పూట మేల్కొనే వాళ్లమని, ప్రస్తుతం ఎలాంటి అవాంతరాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ పగటి పూట తొమ్మిది గంటలు ఇస్తున్నారని చెబుతున్నాడు.

మండలాల వారీగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, ఆయకట్టు..

మండలం	వ్యవసాయ కనెక్షన్లు.	ఆయకట్టు (ఎకరాల్లో)
కోసిగి	6,024	7,520
పెద్దకడబూరు	7,123	8,730
మంత్రాలయం	2,669	3,670
కౌతాళం	3,220	4,220
మొత్తం	19,036	24,140

నాణ్యమై విద్యుత్ సరఫరా అవుతుండటంతో రెండు పంటలు పండిస్తున్నారు.

రెండు పంటలు సాగు చేస్తున్నాం



జగనన్న అధికారంలోకి వచ్చాక పగటి పూట తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా అవుతోంది. ఏటా రెండేసి పంటలు పండిస్తున్నాం. నాకున్న మూడెకరాల్లో మిరప పంట సాగుచేస్తున్నా. విద్యుత్ కోతలు పూర్తిగా తగ్గాయి. పంటలు ఎండి పోకుండా నిరంతర విద్యుత్‌లో పుష్కలంగా సాగునీరు అందుతోంది.

– అంజినయ్య, పెద్దభూంపల్లి

రాత్రి జాగరణ తప్పింది



నాకున్న 6 ఎకరాల్లో రెండు బోర్లు వేయించాం . పొలంలో పత్తి, మిరప, టమాట పంటలు సాగుచేస్తున్నా. విద్యుత్ సరఫరా ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటలకు వరకు ఇస్తున్నారు. గతంలో రాత్రిళ్లు నిద్ర మానుకుని పొలాలకు వెళ్లేవాళ్లం. జగనన్న సీఎం అయ్యాక.. ఇచ్చిన మాట ప్రకారం పగటి సమయంలో విద్యుత్ సరఫరా చేసి మా కష్టాలు తీర్చాడు.

– భీమేష్, రైతు, సాతనూరు

రైతుల అభిప్రాయం మేరకు విద్యుత్ సరఫరా ఇస్తున్నాం



మండలంలో రైతుల అభిప్రాయం, ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నాం. పెండేకల్లు, నేలకోసిగి, వందగల్లు పీడర్ల కింద నిరంతర సరఫరాతో నీరు అందడం లేదని విన్నపం మేరకు సమయం మార్చి ఇస్తున్నాం. రైతులకు తొమ్మిదిగంట పాటు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం.

– వీరేష్, ట్రాన్స్‌కో ఏఈ

గ్రామాల్లోని సమస్యలను గుర్తించండి



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీవిద్య

పెద్దకడబూరు : మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజా ప్రతినిధులు గుర్తించి సభ దృష్టికి తీసుకొని రావాలని ఎంపీపీ శ్రీవిద్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన, ఎంపీడీఓ ఆధ్వర్యంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదవి వినిపించారు. వైస్ ఎంపీపీ -1 ముత్తమ్మ మాట్లాడుతూ చిన్నతుంబళంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో శుభ్రత పాటిచడం లేదని, ఈ విషయాన్ని పలుమార్లు సమావేశంలో విన్నవించినా ఫలితం లేదని సభా దృష్టికి తీసుకొచ్చారు. గవిగట్టు గ్రామ సర్పంచ్ నాగరాజు తమ గ్రామానికి బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. అలాగే పలువురు తమసమస్యలను ప్రస్తావించారు. అనంతరం ఎంపీపీ, ఎంపీడీఓ మాట్లాడుతూ సభలో ప్రస్తావించిన సమస్యలను ఆయా శాఖల అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. గతంలో మాదిరి కాకుండా రాబోయే సర్వసభ్య సమావేశానికి మూడు రోజుల ముందుగానే వివిధ శాఖల మండల అధికారులు తమ ప్రగతి నివేదికను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ -2 ఇర్ఫాన్ దేశాయి, కోఆప్షన్ సభ్యుడు షేర్‌ఖాన్ పటేల్, ఎంఈఓ సువర్ణల సునియం, ఆర్ఐ మహేష్, విద్యుత్ ఏఈ గోవిందు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

హోటళ్ల యజమానులకు సంపూర్ణ సహకారం



నూతనంగా ఎంపికైన కార్యవర్గం, ఎమ్మెల్యే సాయిని సన్మానించిన హోటల్ యజమానులు

ఆదోని సెంట్రల్: హోటళ్ల యజమానులకు తన సహకారం ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని ద్వారకా ఫంక్షన్ హాలులో ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అముదాల హనుమంత రావు మాట్లాడుతూ మంత్రులు బొత్స సత్యనారాయణ, జోగిరమేష్‌ను కలిసి హోటళ్ల యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలపై విన్నవించినట్లు తెలిపారు. స్పందించిన మంత్రులు రాత్రి 12 గంటల వరకు హోటళ్లు నిర్వహించేందుకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. ప్రభుత్వం హోటల్స్‌ను స్మాల్ కేర్ ఇండస్ట్రీగా గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరామన్నారు. అసోసియేషన్ సభ్యులకు బీమా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశామన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజు స్వామి, గౌరవ అధ్యక్షుడిగా బసవనగౌడ్, ఉప అధ్యక్షుడిగా శ్రీనివాసులు, గౌరవ సలహాదారులుగా విట్టారమేష్, శివన్న, లీగల్ అధ్యక్షుడిగా మదవస్వామి, కార్యదర్శిగా వీరేష్ , ట్రెజరర్‌గా ప్రవీణ్‌ను ఎన్నుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రకాంత్‌రెడ్డి ఆదోని, ఎమ్మిగనూర్ ప్రాంతాల హోటళ్ల యజమానులు పాల్గొన్నారు.

వీధికుక్క దాడిలో చిన్నారులకు గాయాలు



గాయపడిన ప్రణీత్, దివ్య, ప్రమోద్

ఎమ్మిగనూరురూరల్: మంత్రాలయం మండలం సూగురు గ్రామానికి చెందిన ముగ్గురు చిన్నారులపై ఆదివారం వీధి కుక్క దాడి చేయటంతో గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన ప్రమోద్, ప్రణీత్, దివ్య ఇంటి ముందు రోడ్డుపై ఆడుకుంటుండగా వీధి కుక్క వచ్చి దాడి చేసింది. చిన్నారులు భయంతో కేకలు వేయడంతో అక్కడున్న పరుగున వచ్చి కుక్కను తరిమేశారు. గాయపడ్డ చిన్నారులను చికిత్స కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, చిన్నపిల్లలపై దాడులకు పాల్పడుతున్నాయని చిన్నారుల తల్లిదండ్రులు వాపోయారు. పంచాయతీ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: భారత్ వికాస్ పరిషత్ తుంగభద్ర శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాల పంపిణీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి బైరెడ్డి చిరంజీవి రెడ్డి, బీవీపీ తిరుపతి ప్రాంత సేవా ప్రముఖ్ రేగూరు బాలకృష్ణ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. బీవీపీ శాశ్వత పథకమైన దివ్యాంగుల పునరావాస యోజన కార్యక్రమంలో భాగంగా ప్రమాదవ శాత్తు, దీర్ఘ రోగాలతో కాళ్లు పోగొట్టుకున్న, పోలియో దివ్యాంగులకు నాణ్యమైన కృత్రిమ కాళ్లు, చేతులు, కాలిపర్స్ ఇస్తామన్నారు. ఆగస్టు 5 లోగా 90000 88660, 81425 50143 నంబర్ల ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

సాంఘిక నాటకాలను ఆదరించండి

కర్నూలు కల్చరల్: సామాజిక సమస్యలకు ప్రతిరూపమైన సాంఘిక నాటకాలని ఆదరించాల్సిన అవసరం ఉందని విశ్రాంత ఐఏఎస్, సీనియర్ కళాకారులు గుమ్మళ్ల బలరామయ్య, పడమటి గాలి నాటక రచయిత పాటిబండ్ల ఆనందరావు అన్నారు. నెల నెలా సాంఘిక నాటకాల్లో భాగంగా ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో గుంటూరు అభినయ ఆర్ట్స్ వారిచే ఎస్.రవీంద్రరెడ్డి దర్శకత్వంలో 'అతీతం' అద్దెపల్లి లక్ష్మణ శాస్త్రి దర్శకత్వంలో 'థ్యాంక్స్ ఫర్ ది పీఎం' నాటకాలను ప్రదర్శించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాటకాల దర్శకులు, రచయితలు, నటులను సన్మానించారు.

నేడు అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

కోసిగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో మండల స్థాయి అధికారులతో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సోమవారం సమీక్ష సమావేశం నిర్వహిస్తారని ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలు లబ్ధి పొందుతున్న వివరాలు, అభివృద్ధి పనులపై చర్చిస్తారని చెప్పారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు అభివృద్ధి నివేదికలతో రావాలని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

మంత్రాలయం రూరల్: మండలంలోని సూగూరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ వేణుగోపాల్‌రాజు ఆదివారం తెలిపారు. సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేసి ఏపీ39టీవీ 0598 నంబర్ గల ట్రాక్టర్, ట్రాలీ ఏపీ39ఎక్స్ 4950ను సీజ్ చేసి తదుపరి చర్యల నిమిత్తం మండల తహసీల్దార్‌కు పంపామని చెప్పారు. మాధవరం గ్రామానికి చెందిన ఎ.నరసింహులుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

కోసిగి: మండల కేంద్రానికి చెందిన నాడుగేని కృష్ణ కర్ణాటక మద్యం బైక్‌పై తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపారు. ఆదివారం కృష్ణ పల్సర్ బైక్‌పై కర్ణాటక రాష్ట్రానికి చెందిన 10బాక్స్‌లు 90ఎంఎల్ 960 మద్యం టెట్రా ప్యాకెట్లు తీసుకొస్తుండగా పోలీసులను చూసి బైక్ మద్యం బాటిళ్లు పడేసి పరుగులు తీయగా వెంబడించి పట్టుకున్నట్లు చెప్పారు. నిందితుడు, మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని, బైక్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఏఎస్ఐ నాగరాజు, కాశయ్య, రాఘవేంద్ర, మల్లికార్జున స్వామి పాల్గొన్నారు.

తల్లి తిట్టిందని ఆత్మహత్యాయత్నం

ఆదోనిఅర్బన్: ఆలూరు మండలంలోని హుళేబీడు గ్రామానికి చెందిన ఓబిసమ్మ అనే యువతి ఆదివారం తల్లి తిట్టిందని పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఓబిసమ్మను గమనించిన కుటుంబ సభ్యులు ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లి తిట్టడంతో యువతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని వైద్య సిబ్బంది తెలిపారు. మెరుగైన చికిత్స కోసం యువతిని కర్నూలుకు వైద్యులు రెఫర్ చేశారు.

యువకుడిపై దాడి

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని అరుంజ్యోతినగర్‌లో నివాసముంటున్న మారెన్న అనే మతిస్థిమితంలేని యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం దాడి చేయడంతో గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వేధింపుల కేసు నమోదు

మంత్రాలయం రూరల్: మండలంలోని సూగూరు గ్రామంలో ఓ వివాహితపై అదే గ్రామానికి చెందిన చాకలి గోవిందు లైంగికంగా వేధించడంతో పాటు బెదిరింపులకు పాల్పడటంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వేణుగోపాల్‌రాజు ఆదివారం తెలిపారు. కొన్నాళ్లుగా ఆమెను వేధిస్తుండటంతో భరించలేక ఆమె ఫిర్యాదు చేసిందని ఎస్ఐ చెప్పారు.

మానసిక శిక్షణ కేంద్రం ప్రారంభం

ఆదోని సెంట్రల్: విద్యార్థుల కోసం స్ఫూర్తి స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మానసిక శిక్షణ కేంద్రాన్ని ఎంఈఓ బి.శివరాములు ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రత, మానసిక స్థైర్యం కలిగి ఉండాలన్నారు.

మరమ్మతులు చేయరూ!



వంతెన రక్షణ గోడ పడిపోయిన దృశ్యం

ఆదోని సెంట్రల్ : పట్టణంలో శ్రీనివాసభవన్ నుంచి పాత బస్టాండ్‌కు వెళ్లే రహదారిలోను ఓవర్ బ్రిడ్జికి ఉన్న రక్షణ గోడ పడి పోయింది. దీంతో ఓవర్ లోడ్ లారీలు, బస్సులు బ్రిడ్జి మీద వెళ్ల కూడదని అధికారులు నిషేధించారు. ఆటోలు, స్కూటర్లు, కాలినడకన వెళ్లే వారు ఆ రహదారి గుండా వెళ్తుంటారు. బ్రిడ్జి చుట్టూ ఉన్న రక్షణ గోడలతో పాటు వంతెన కూడా శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు ముంచుకు వస్తాయోనని స్థానికులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాలు చోటు చేసుకుకోకముందే మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ఎల్లెల్సీని పరిశీలించిన ఈఈ



హొళగుంద సెక్షన్‌లో తుంగభద్ర దిగువ కాలువను పరిశీలిస్తున్న ఈఈ, సెక్షన్ అధికారులు

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) సబ్ డివిజన్ 2, 3లోని హొళగుంద సెక్షన్ వరకు ఆదివారం ఎల్లెల్సీ కర్ణాటక ఈఈ నీలకంఠరెడ్డి పర్యటించారు. ఎల్లెల్సీకి ఈ నెల 28న నీరు విడుదల చేయడంతో కాలువలో నీటి ప్రవాహం, కాలువ పరిస్థితిని పరిశీలించారు. రైతులు అక్రమంగా నీటిని మళ్లించుకోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎస్‌డీఓ, సెక్షన్ ఆఫీసర్లకు సూచించారు. కాలువకు నీటి విడుదల అయినందున ఆంధ్రాకు పూర్తిస్థాయిలో నీటిని అందించేందుకు కృషి చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలనంతరం డిస్ట్రిబ్యూటరీ (డీపీ)లకు ఇండెంట్ ప్రకారం నీరు విడుదల అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా అక్రమంగా నీటిని మళ్లించుకునే అవకాశాలున్న ప్రాంతాల్లో అరికట్టాలన్నారు. అలాగే కాలువ పరిధిలో ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పరిశీలించి వెంటనే పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ప్రధానంగా తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రా కోటా నీటిని పూర్తిస్థాయిలో అందించేందుకు కృషి చేయాలన్నారు. ఆయన వెంట హొళగుంద-3 ఎస్డీఓ అమర్‌నాథ్‌రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమానికి కృషి



పత్తికొండ డివిజన్ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

పత్తికొండ టౌన్: రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమం కోసం పాటుపడతామని డివిజన్ నూతన అధ్యక్షుడు బి.నాగరాజు అన్నారు. ఆదివారం స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని 9 మండలాలకు చెందిన రెవెన్యూ ఉద్యోగులు సమావేశమై, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా రజనీకాంత్ రెడ్డి, రమేశ్ రెడ్డి, వలిబాషా, టీఎండీ హుసేన్ వ్యవహరించారు. ఏపీఆర్ఎస్ఏ పత్తికొండ డివిజన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా బి.నాగరాజు, అసోసియేట్ అధ్యక్షుడిగా జె.బాబు, ఉపాధ్యక్షులుగా రఘురామిరెడ్డి, ఈరమ్మ, బసవన్న గౌడ్,తో పాటు కార్యదర్శి, సహాయ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను రెవెన్యూ ఉద్యోగులు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఐకమత్యంతో పోరాడతామన్నారు.

3న రాష్ట్రానికి చేరనున్న ఎల్లెల్సీ నీరు



ఆయకట్టు కింద సాగుచేసిన వరి పైరు

ఆలూరు: ఆంధ్ర, కర్ణాటక రాష్ట్ర ప్రజలు, రైతులకు జీవనాడిగా ఉన్న తుంగభద్ర జలాశయానికి ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా పెద్ద ఎత్తున వరద వచ్చి చేరుతోంది. దీంతో మూడురోజుల క్రితం టీబీ డ్యాం సెక్రటరీ నాగమోహన్, ఎస్‌ఈ శ్రీనాథ్ రెడ్డి, ఈఈ నీలకంఠ రెడ్డి, డీఈ అమర్‌నాథ్‌రెడ్డి తాగు, సాగునీటి అవసరాల కోసం గేట్లకు ప్రత్యేక పూజలు చేసి దాదాపు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ఎల్లెల్సీ కాలువ పనులకు దాదాపు పూర్తి చేశారు. ఆయకట్టు కింద వరి పంటను సాగు చేసుకునేందుకు బోర్డు అధికారులు అవకాశం కల్పించారని రైతులు, సాగునీటి సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బోర్ల కింద వరినారు సాగుచేసిన వారు ధరలు రెట్టింపు చేశారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు 3వ తేదీకల్లా ఆంధ్ర సరిహద్దు హాలహర్వి మండలం చింతకుంట గ్రామ సమీపంలో 136 కి.మీ కాలువకు నీరు చేరే అవకాశం ఉందని ఎల్లెల్సీ ఇంజినీర్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆలూరు: ఆలూరుకు చెందిన బోయ నరేష్, ఉగాది రాము మోటార్ బైక్‌పై వెళుతూ అదుపుతప్పి కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. వారు ఆదివారం గ్రామం నుంచి చిప్పగిరి మండలం బెల్డోణ గ్రామానికి ఏపీ 39 కేటీ 7483 బుల్లెట్ బైక్‌పై బయలుదేరారు. హత్తిబెళగళ్ గ్రామ సమీపంలో ఉన్న కల్లెవంక వాగు వద్ద బైక్ అదుపుతప్పడంతో ఇద్దరూ కిందపడ్డారు. నరేష్‌కు కుడి చెంప, కాళ్లు, చేతులకు రక్తగాయాలయ్యాయి. అలాగే ఉగాది రాము కుడి చేతికి, ఛాతిపై రక్తగాయాలయ్యాయి. నరేష్‌ను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి, రామును అనంతపురం జిల్లా గుంతకల్లుకు చికిత్స నిమిత్తం ప్రైవేటు వాహనాలలో బంధువులు తరలించారు. క్షతగాత్రులను జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్, మండల కన్వీనర్ వీరేష్ తదితరులు వారిని పరామర్శించారు.